క్లుప్తంగా

వాహనాల రాకపోకలకు అనుమతి



నందివాడ: పుట్టగుంట బుడమేరు వంతెనపై భారీ వాహన రాకపోకలకు ఆర్‌అండ్‌బీ, పోలీస్ అధికారులు శనివారం నుంచి అనుమతిచ్చారు. నందివాడ మండలం పుట్టగుంట-బుడమేరు ఉద్ధృతి తగ్గడంతో శుక్రవారం నుంచే ద్విచక్ర వాహనాలకు అనుమతులిచ్చారు. వరద మరింత తగ్గటంతో ఆర్‌అండ్‌బీ అధికారులు, నందివాడ ఎస్‌ఐ కె.శ్రీనివాస్ బుడుమేరు బ్రిడ్జిని పరిశీలించి ఇబ్బంది లేదని భారీ వాహనాలకు రాకపోకలకు అనుమతించారు.

పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభం



గుడివాడ టౌన్: రానున్న ఐదేళ్లలో గుడివాడను ప్రగతి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక శ్రీ కాళహస్తి కాలనీలో రూ.29 లక్షలతో పైప్ లైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. డ్రెయిన్లలో సిల్టు తొలగించి రోడ్లపై నీళ్ల నిల్వకుండా చర్యలు చేపట్టామన్నారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు ఎంప్లాయిస్ సెక్రటరీగా చిలుముల



చిలుముల

గుడ్లవల్లేరు: గుడివాడ బ్యాంకు ఎంప్లాయిస్ కో–ఆర్డినేషన్ సెక్రటరీగా అంగలూరు కెనరా బ్యాంకు ఉద్యోగి చిలుముల అభయాంజనేయ స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ జనరల్ బాడీ మీటింగ్‌లో తనను కామ్రేడ్ రమణమూర్తి, సీతారామయ్య నియమించారని శనివారం తెలిపారు. తనను నియమించిన నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ బ్యాంకు ఉద్యోగుల బలోపేతానికి తాను కృషి చేస్తానని చిలుముల పేర్కొన్నారు.

ఆక్రమణలతోనే కొల్లేరు ఉగ్రరూపం

మండవల్లి: ఆక్రమణలతో కొల్లేరు కుచించుకుపోతున్నా పట్టించుకున్న నాథుడే లేడని సామాజిక కార్యకర్తలు ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు అన్నారు. శనివారం మండవల్లిలో మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు కోర్టు ఆదేశాలు అమలు చేయక పోవడంతో కొల్లేరు సరస్సులో ఆక్రమణలతో ఉగ్రరూపం దాల్చి కొల్లేటి లంక గ్రామాలు వరదలో చిక్కుకున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

రాజీ పడటమే ఉత్తమ మార్గం



కైకలూరు కోర్టులో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి



గుడివాడలో కేసు పరిష్కార పత్రాలు అందజేస్తున్న న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం



మొవ్వ న్యాయస్థానంలో లోక్ అదాలత్

కైకలూరు: క్షణికావేశంలో చేసిన చిన్న తప్పుల వల్ల విలువైన కాలాన్నీ, డబ్బును వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవడం ఉత్తమమని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వీవీఎస్‌వీ.లక్ష్మి పేర్కొన్నారు. కైకలూరు కోర్టు వద్ద జాతీయ లోక్ అదాలత్ శనివారం జరిగింది. ముందుగా కోర్టుకు వివిధ కేసుల రాజీ కోసం వచ్చిన కక్షిదారులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ అదాలత్‌లో తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. ఇరుపక్షాల సమ్మతం మేరకే కేసులు రాజీ జరుగుతాయన్నారు. కోర్టు పరిధిలో 298 కేసులను పరిష్కరించి కక్షిదారులకు రూ.83,28,476 నగదు అందించారు. కార్యక్రమంలో న్యాయవాది వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, ప్యానెల్ న్యాయవాదులు పి.పవన్‌కాంత్, పి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

కేసుల రాజీతోనే రాజమార్గం

గుడివాడ టౌన్: కేసుల పరిష్కారంలో రాజీ చేసుకోవడం రాజమార్గం వంటిదని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం నాలుగు బెంచ్‌లు ఏర్పాటుచేసి 1,273 కేసులు పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు. ఇందులో సివిల్ 21, క్రిమినల్ 1,248, ఇతర కేసులు 14, మొత్తం కేసుల విలువ రూ. 2 కోట్ల 38 లక్షల 44 వేలుగా గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర సివిల్ జడ్జి బి.లక్ష్మీ నారాయణ, జూనియర్ సివిల్ జడ్జి ఎం. సుధా రాణి, మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి.గాయత్రి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి హరినాథ్ పాల్గొన్నారు.

మొవ్వలో 105 కేసుల పరిష్కారం

మొవ్వ: మొవ్వ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక న్యాయస్థానంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 105 కేసులకు పరిష్కారం లభించింది. రాజీమార్గమే రాజ మార్గమంటూ న్యాయమూర్తులు ఇచ్చిన పిలుపు మేరకు జ్యుడీషియల్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు మొవ్వ న్యాయమూర్తి పీ రాజన్ ఉదయ్ ప్రకాష్ పర్యవేక్షణలో కేసులు పరిష్కారం చేశారు.

ఘనంగా గణనాథుడి ఉత్సవాలు



గుడివాడలో శ్రీ లక్ష్మీ గణపతిగా స్వామి



గురజాడలో వినాయక నిమజ్జన ఊరేగింపు

పమిడిముక్కల: మండలంలో ఏడు రోజులుగా గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గుర్రాల్లంక బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నసంతర్పణ జరిగింది. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని అన్నసంతర్పణలో పాల్గొన్నారు. గురజాడ గౌడ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి స్థానికంగా ఉన్న కాలువలో నిమజ్జనం చేశారు. యువకులు, చిన్నారులు రంగుల చల్లుకొంటూ, టపాసులు కాల్చుతూ, డ్యాన్స్ వేస్తూ సందడి చేశారు.

శ్రీ లక్ష్మీ గణపతికి పూజలు

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామిని శ్రీ లక్ష్మీ గణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు. ఘనంగా లక్ష్మీ గణపతి హోమం దేవస్థానంలో శనివారం ఘనంగా లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. 100 మంది దంపతులు పాల్గొని హోమం పూజలు నిర్వహించారని ఆలయ ఈఓ ప్రసాద్ తెలిపారు.

కైకలూరులో..

కైకలూరు: గ్రామాల్లో గణేష్ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గోనెపాడులో శనివారం భారీ అన్నసమారాధన జరిగింది. ఆటపాక, కైకలూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద పందిర్లలో అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ నగర్ కరగట్టులో ఆది వినాయక స్వామి 15వ వార్షిక చవితి మహోత్సవాలు సందర్భంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో..

మండవల్లి: మండవల్లిలో వినాయక చవితి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి భారీఅన్న సమారాధన జరిగింది. మండవల్లి, కొర్లపాడు, పెరికెగూడెం, మొఖాసాకలవపూడి, గన్నవరం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అన్న సమారాధనలో పాల్గొన్నారు.

ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి

పెదపూడి(మొవ్వ): ఐరన ఎక్కువగా ఉండే మునగాకు, గోంగూర లాంటి ఆకుకూరలతో పాటు ఐసీడీఎస్‌ల ద్వారకా అందిస్తున్న ట్యాబ్‌లెట్స్, డీవార్మింగ్ మాత్రలకు క్రమం తప్పకుండా వినియోగించాలని ఏఎన్ఎం కే బుజ్జి సూచించారు. మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల పెదపూడి అంగన్‌వాడీ కేంద్రం–3లో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతు, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ నాగమణి, కే జ్యోతి లక్ష్మి, ఎం.జ్యోతి, జి.పద్మజ, వెంకటేశ్వరమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శాంతి స్థాపకు కృషి చేయాలి



క్రీస్తు విశ్వాసులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

అడ్డాడ(పామర్రు): ప్రతిఒక్కరూ శాంతి స్థాపనకు కృషి చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని అడ్డాడ గ్రామంలోని శిలువ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా తైలాభిషేక పండగ కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచే కాకుండా ఇరుగు పొరుగు రాష్ట్రాల నుంచి అనేక మంది క్రీస్తు విశ్వాసులు పాల్గొని సాక్ష్యాలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన సేవా మార్గంలో పయనిస్తూ ఆయన బోధనలను అనుసరించాలన్నారు. దైవజనురాలు లూథియానా మాట్లాడుతూ ఎంతో మంది విశ్వాసులకు ప్రభువు సాక్ష్యాలను ఇచ్చి వారిని ఆదుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కాటూరి శ్రీనివాస్, కె.శ్రీను, దైవజనులు క్రీస్తు రాయబారి లూథియానా అమ్మ, పాస్టర్లు ప్రభు, మిల్కిషదక్(రామకృష్ణ), అకుల్లా(ప్రసాద్), సత్యం, విజయ్‌శేఖర్, అబ్రహం పాల్గొన్నారు.

పశుగ్రాసం పంపిణీ

నందివాడ: మండలంలోని వరద ముంపు గ్రామాల్లో బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. చిన లింగాల గ్రామంలో శనివారం పెద్ద లింగాల, చిన్న లింగాల, చేదుర్తిపాడు, ఒడ్డుల మెరక, అరిపిరాల, ఇలపర్రు గ్రామాల పరిధిలోని పాడి రైతులకు 220 పశుగ్రాస బస్తాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చేయడం అభినందనీయం

పామర్రు: డ్వాక్రా సంఘాల సభ్యులు వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేయటం అభినందనీయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో డ్వాక్రా సంఘాలు ఎమ్మెల్యేకు రూ.50వేల డీడీను శనివారం అందజేశారు. కార్యక్రమంలో వీఓ ప్రెసిడెంట్ యార్లగడ్డ పుష్పలత, రాధిక పాల్గొన్నారు.

మేడూరు గ్రామం నుంచి..

పమిడిముక్కల మండలం మేడూరు గ్రామం యలమంచిలి బ్రమరాంభ వరద బాధితుల సాయం నిమిత్తం రూ.50 వేల చెక్కును, గ్రామస్తులు రూ.85,718ను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు అందజేశారు. గుళ్లపల్లి సురేష్ బాబు, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ సుంకర వెంకటేశ్వరస్వామి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

కైకలూరు: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో మొబైల్ మిస్డ్ కాల్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకోవాలని కామినేని పిలుపు ఇచ్చారు. ముందుగా ఆయన మొబైల్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకున్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేంపాటి విష్ణురావు, మండలాధ్యక్షుడు కట్టా వీర రాఘవులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

గుడివాడ టౌన్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల్లో శనివారం హిందీ దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ మాట్లాడుతూ హిందీ గొప్పదనం విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, హిందీ విభాగాధిపతి డి.సువర్ణలక్ష్మి, కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు పాల్గొన్నారు.

వరద బాధితులకు చిన్నారుల సాయం

గుడ్లవల్లేరు: వరద బాధితులకు చిన్నారులు తమవంతు సాయం అందించినట్లు స్థానిక శ్రీ సాయి విద్యానికేతన్ చైర్మన్ సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. శనివారం తమ పాఠశాలలోని విద్యార్థులు వరద బాధితులకు తమ పాకెట్ మనీ రూ.3,650 సాయం చేశారని పేర్కొన్నారు.

వాటర్ బాటిళ్ల అందజేత

గుడివాడ టౌన్: స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ బృందం ఆధ్వర్యంలో వరద బాధితులకు సాయం అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు తెలిపారు. కళాశాలకు చెందిన 40 మంది వలంటీర్లు స్నాక్స్, వాటర్‌బాటిల్స్‌ను నందివాడ జెడ్పీ హైస్కూల్లో ఉన్న వరద బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఈఓ బాలాజీ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవరాత్రి మహోత్సవ రాటా ఏర్పాటు



గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్ రోడ్‌లోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో శనివారం నవరాత్రి మహోత్సవ రాటా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పునీత్‌శర్మ మాట్లాడుతూ అక్టోబర్ మూడో తేదీ నుంచి 12 వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఈఓ జి.శిరీష, ఉద్యోగులు జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్యాన శిక్షణ

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధ్యాన శిక్షణ శనివారం కూడా కొనసాగింది. ఈ నెల 17వ తేదీ వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని నిర్వాహకురాలు రాజకుమారి తెలిపారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలల్లో శనివారం ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్స్ డే జరిపారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య నైపుణ్యాలను యువత ఆదర్శంగా తీసుకుని మరింత ప్రయోగాత్మకంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండ రామయ్య, డైరెక్టర్ బి. కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముంపులో నానుతున్న కొల్లేరు గ్రామాలు



కైకలూరు మండలం కొట్టాడలో తగ్గని వరద నీరు

కైకలూరు: వరద తగ్గుముఖం పడుతున్నప్పటికీ కొల్లేరు గ్రామాలు ముంపు నీటిలోనే నానుతున్నాయి. ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు కొందరికే అందుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉప్పుటేరు ముఖద్వారం వద్ద డిశ్చార్జ్ కెపాసిటీ 2.5గా శనివారం నమోదైంది. ఎగువ నీటిని సముద్రానికి చేరవేసే మండవల్లి మండలం పెదఎడ్లగాడి వంతెన వద్ద నీటి మట్టం 3.19 మీటర్లుగా నమోదైంది. బుడమేరు నుంచి వచ్చిన వరద నీటికి సమీప డ్రెయిన్ల నీరు తోడవడంతో కొల్లేరు ముంపు బారిన పడింది. మండవల్లి మండలంలో పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, నందిగామలంక, శ్రీరామ్‌నగర్, నుచ్చిమిల్లి, పులపర్రు, కొవ్వాడలంక, ఉనికిలి, తక్కెళ్లపాడు, మూడుతాళ్లపాడు గ్రామాలు, కైకలూరు మండలం పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప, కొట్టాడ, రాజుల కొట్టాడ, పల్లెపాలెం, పందిరిపల్లిగూడెం, గుమ్మళ్లపాడు, శృంగవరప్పాడు, లక్ష్మీపురం, గోకర్ణపురం, కొల్లేటికోట గ్రామాల రహదారులు నీట మునిగాయి. ప్రజలు పడవలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇప్పటికీ గ్రామాల్లో నీరు తగ్గలేదు.

3.19 మీటర్ల నీటి మట్టం

ఎగువ నుంచి చేరుతున్న వరద నీరు తగ్గుముఖం పట్టింది. పెదఎడ్లగాడి వంతెన వద్ద 3.19 మీటర్లకు నీటి మట్టం చేరింది. మరో రెండు రోజుల్లో మరింత తగ్గుతుందని డ్రెయినేజీ అధికారులు చెబుతున్నారు. కైకలూరు నుంచి ఏలూరు వెళ్లే ప్రధాన రహదారిపై నీరు ప్రవహించడంతో 10 రోజులకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డుపై నీటి ప్రవాహం కాస్త తగ్గడంతో వాహనాలను పోలీసులు అనుమతిస్తున్నారు. మరో రెండు రోజుల్లో రాకపోకలు పునరుద్ధరిస్తామని పోలీసులు తెలిపారు.

డ్రెయిన్లకు మరమ్మతులు అవసరం

కైకలూరు నియోజకవర్గంలో ప్రధాన డ్రెయిన్లు పుల్లవ, పెద కొమ్ములేరు, లాల్వ, పోల్‌రాజ్, చిన కొమ్ములేరు, శ్యాంప్, రాళ్ళకోడు డ్రెయిన్లకు మరమ్మతులు లేకపోవడంతో కైకలూరు, తామరకొల్లు, వేమవరప్పాడు, గోపవరం వంటి గ్రామాలు నీట మునిగాయి. ప్రధానంగా పుల్లవ, రాళ్లకోడు డ్రెయిన్లు ఆక్రమణలకు గురవడంతో పలు గ్రామాలు ఇప్పటికీ వర్షం నీటిలో నానుతున్నాయి.

ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
RK BUILDERS
Opp. బొమ్మరిల్లు థియేటర్, ఏలూరు రోడ్డు, గుడివాడ.
కె.వి. రమణరావు
సెల్ : 98485 17112

ప్రకటన























